క్లుప్తంగా

ఐక్యతా స్థూపానికి శంకుస్థాపన



శంకుస్థాపన పూజల్లో సంఘ ప్రతినిధులు

కవిటి: పూరీ, గంజాం, శ్రీకాకుళం రెడ్డిక మహాజన పురోభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో తమ సంఘం ఐక్యను చాటిచెప్పడం కోసం ఐక్యత స్థూపాన్ని ఏర్పాటు చేస్తున్న ప్రతినిధులు తెలిపారు. ఇందులో భాగంగా కొత్త కొజ్జీరియా జంక్షన్ వద్ద గల సంఘ భవనం ఆవరణలో విజయస్థూపం నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. వందేళ్ల తమ సంఘం విజయోత్సవాల్ని నిర్వహించడమే లక్ష్యంగా 100 రోజుల్లో స్థూపాన్ని నిర్మించనున్నట్టు నేతలు ప్రకటించారు.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

సోంపేట: పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారిణి శిరీష అన్నారు. పలాసపురం గ్రామంలో పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా నివారణ టీకాలను ఆదివారం వేశారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. సర్పంచ్ తడక జోగారావు, ఎంపీటీసీ సభ్యుడు పోలాకి వెంకటరమణ, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నారీశక్తి యాప్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఎస్సై శ్రీనివాస్

ఇచ్ఛాపురం రూరల్: మహిళల భద్రత కోసం ప్రభుత్వం నారీశక్తి యాప్‌ను రూపొందించిందని ఇచ్ఛాపురం రూరల్ ఎస్సై ఇ.శ్రీనివాస్ అన్నారు. ఈదుపురం గ్రామంలో మహిళలకు నారీశక్తి యాప్‌పై ఆదివారం అవగాహన కల్పించారు. మహిళా భద్రత, శక్తి యాప్ ఆవశ్యకత, సామాజిక మాధ్యమాల ద్వారా జరుగుతున్న వేధింపులు, సైబర్ మోసాలపై అప్రమత్తం, బాల్య వివాహాలు నియంత్రణపై అవగాహన కల్పించారు.

మంచినీటి కల్పనకు ప్రాధాన్యం



బోరును ప్రారంభిస్తున్న నాయకులు

కవిటి: గ్రామాల్లో మంచినీటి కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఎంపీపీ కడియాల పద్మ వెల్లడించారు. ఇందుకోసం మండల పరిషత్ నిధులు కేటాయిస్తున్నామన్నారు. ఆర్.భైరిపురం రామాలయం ఆవరణలో మండల పరిషత్ నిధులు రూ.1.50 లక్షలతో ఏర్పాటు చేసిన విద్యుత్‌మోటర్ బోరుబావిని ఎమ్మెల్సీ నర్తు రామారావుతో కలిసి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కడియాల ప్రకాష్, గ్రామపెద్దలు సనపల శ్రీనివాసరావు, పుల్లట జగదీష్, పిరియా ఆనందరావు, వై.నీలయ్య, పిరియా వైకుంఠరావు, బి.కీర్తి, వై.సత్యం, ధనంజయం, గోపాల్, సంతోష్, నూకయ్య పాల్గొన్నారు.

పరిహారం.. పరిహాసం!

- గత ఏడాది వరి పంట నష్టపోయిన రైతులకు అందని పరిహారం
- ఎనిమిది నెలలుగా ఎదురు చూపులు



డిసెంబర్‌లో కురిసిన వర్షాలకు నేలకొరిగిన వరి పంట

సోంపేట: రైతులను కూటమి సర్కార్ నిర్లక్ష్యం చేస్తోందనే విమర్శలు వస్తున్నాయి. ఆరు నెలలు శ్రమించి 2024–25లో ఖరీఫ్‌లో వరిపంటను సాగు చేసి నష్టపోయిన రైతులకు ఇప్పటి వరకూ పరిహారం ఇవ్వకుండా జాప్యం చేస్తుండడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమతో పరిహాసం తగదంటున్నారు. 2024 డిసెంబర్ నెలలో కురిసిన అకాల వర్షాలకు చేతికందిన పంట నీటమునిగిపోయింది. దీంతో వందలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆదుకోవాల్సిన కూటమి ప్రభుత్వం పక్షపాతం చూపింది. ఈ ఏడాది జనవరిలో పంటనష్ట పోయిన రైతుల పేర్లు నమోదు చేసినప్పటికీ ఎనిమిది నెలలు గడిచినా ఇంతవరకు నష్టపరిహారం అందించలేదు.

అధికారులు నమోదు చేసిన పంట నష్టం వివరాలు

మండలం	రైతులు	హెక్టార్లు	అందించాల్సిన నగదు రూ. లక్షల్లో
సోంపేట	56	12.13	రూ.2.06
ఇచ్ఛాపురం	280	80.79	రూ. 13.73
కవిటి	239	44.09	రూ. 7.06
కంచిలి	221	49.88	రూ. 8.48

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఇలా..

ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని సోంపేట, ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి మండలాల్లో గత ఖరీఫ్ సీజన్‌లో సుమారు 30 వేల ఎకరాల్లో వరి పంటసాగు చేశారు. డిసెంబర్ నెలలో కురిసిన అకాల వర్షాలకు ముందే సగం కోతలు పూర్తి చేశారు. అయితే కోసిన చేను పొలాల్లో ఉంటుండగానే భారీ వర్షాలు కురవడంతో నీటమునగడంతో నష్టవాటిల్లింది.

పరిహారం నమోదు క్రమంలో కొర్రీలు..

పంట నష్ట పరిహారం కోసం రైతుల పేర్లు నమోదు చేసే క్రమంలో ప్రభుత్వం పలు కొర్రీలు పెట్టింది. పంట నీటిలో మునిగిపోయిన రైతుల పేర్లు మాత్రమే వ్యవసాయ సిబ్బంది నమోదు చేశారు. దీంతో వేలాది మంది రైతులకు పంట నష్టం వాటిల్లినా పరిహారం కోసం పేర్లు నమెదు చేసుకునే అవకాశం లేకుండా పోయింది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 786 మంది రైతులను గుర్తించి పరిహారం అందించడానికి వ్యవసాయాధికారులు నివేదికలు 2025 జనవరిలో తయారు చేశారు. అయితే గత ఖరీఫ్ ముగిసి తాజాగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ నష్టపరిహారం మాత్రం నేటికీ అందలేదు. దీంతో రైతులకు ఎదురు చూపులే మిగిలాయి.

నష్టపరిహారం అందజేయాలి

గత డిసెంబర్‌లో కురిసిన అకాల వర్షాలకు రెండు ఎకరాల్లో వరిపంటకు తీవ్ర నష్టం కలిగింది. అధికారులు పంట నష్ట పరిహారం కోసం పేర్లు నమోదు చేశారు. అయితే ఎనిమిది నెలలు గడుస్తున్నా ఒక్క రూపాయి కూడా పరిహారం అందించలేదు. ప్రభుత్వం, వ్యవసాయాధికారులు స్పందించి నష్ట పరిహారం అందజేసి ఆదుకోవాలి.

– మద్దు బుచ్చిబాబు, రైతు, బెంకిలి గ్రామం

వివరాలు అందజేశాం

ఖరీఫ్‌సీజన్‌లో వరి పంట పాడైపోయిన నాలుగు మండలాల్లోని రైతుల వివరాలు నమోదు చేశాం. వివరాలను ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి అందజేశాం. రైతులు పరిహారం కోసం ఎదురు చూస్తున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.

వ్యవసాయాధికారి, సోంపేట

పలాస లయన్స్‌క్లబ్‌కు ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ కృష్ణమూర్తి

కాశీబుగ్గ: పలాసలోని లయన్స్ క్లబ్‌కు అరుదైన గుర్తింపు లభించింది. విశాఖపట్నం రామ్‌నగర్‌లోని లయన్స్ క్లబ్ హాల్‌లో 2024–25 సంవత్సరానికి సంబంధించి అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పలాస లయన్స్ క్లబ్ అధ్యక్షుడు హనుమంతు ఎండుదొర, ప్రధాన కార్యదర్శి టి.మాధవరావు, కోశాధికారి నెమలిపురి అప్పారావు సభ్యుల సహకారంతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు అవార్డు వరించింది. పూర్వ గవర్నర్ కె.వి.సుబ్బారాజు, రెండవ గవర్నర్ నున్నా శ్రీనివాసరావు నుంచి క్లబ్ సీనియర్ సభ్యులు ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి అవార్డును స్వీకరించారు. అలాగే జోన్ చైర్‌పర్సన్ రోణంకి హిమాచలానికి ప్రత్యేక పురస్కారం అందజేశారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా ధర్నా రేపు



సూదికొండలో ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

కాశీబుగ్గ: స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా ఈ నెల ఐదో తేదీన విద్యుత్ సబ్ స్టేషన్లవద్ద చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు నెయ్యల గణపతిరావు కోరారు. ప్రజలపై భారాలు మోపే స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని, పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ కాశీబుగ్గ సూదికొండ, పలు ప్రాంతాల్లో ఆదివారం ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు టి.అజయ్‌కుమార్, తెప్పల రాజు, కె.లోకనాథం, ఎం.రాజు, ఎం.నిర్మల, కె.సుహాసిని, టి.సిమ్మయ్య పాల్గొన్నారు.

ధర్మాన్ని కాపాడుదాం



మాట్లాడుతున్న భరత్‌కుమార్

ఇచ్ఛాపురం టౌన్: ధర్మాన్ని మనం కాపాడితే ధర్మం దేశాన్ని కాపాడుతోందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ దక్షిణమధ్య క్షేత్రప్రచారక్ భరత్‌కుమార్ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఇచ్ఛాపురంలోని జ్ఞానభారతి పాఠశాలలో ఆదివారం హిందుత్వం, ధర్మపరిరక్షణ, కుటుంబ ఆచారాల గురించి వివరించారు. కార్యక్రమంలో ముల్లేటి గణపతిరావు, గొనప దాసప్ప, వెచ్చా కేశవరావు, పాక తులసీదాస్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

మోదం.. ఖేదం!



కొళిగాం ప్రాంతంలో వ్యవసాయ పనుల్లో రైతులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. కొన్ని ప్రాంతంలో పొలాలకు సాగునీరు అందుతుండగా వారు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. మరో వైపు సాగునీరు లేక కొన్ని గ్రామాల్లో పొలాలు బీళ్లుగా మారిపోతున్నాయి. ఖరీఫ్ సీజన్ మొదట్లో కురిసిన వర్షాలకు అన్ని ప్రాంతాల్లోని రైతులు వరినారు వేసుకున్నారు. తర్వాత సరైన వర్షాలు కురవకపోవడంతో సన్యాసిపుట్టుగ, నీలాపుట్టుగ, ఈదుపురం, కొఠారీ, ధర్మపురం, తులసిగాం, లొద్దపుట్టి, జగన్నాధపురం, టి.బరంపురం, మండపల్లి, బాలకృష్ణాపురం, రత్తకన్న, మశాఖపురం ప్రాంతాల్లో పొలాలు బీళ్లుగా మారిపోయి వరినారు ఎండిపోతుండగా.. తేలుకుంచి, హరిపురం, ముచ్చింద్ర, కేదారిపురం, కొళిగాం, బొడ్డబడ, బిర్లంగి ప్రాంతాల్లో రైతులు మోటారు బోర్లు సహాయంతో నాట్లు వేసుకుంటున్నారు. మండలంలో 3,130 హెక్టార్లలో వరిసాగు విస్తీర్ణం లక్ష్యం కాగా ఇప్పటి వరకు 120.56 హెక్టార్లలో మాత్రమే వరినాట్లు వేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.



సాగునీరు లేక లొద్దపుట్టిలో బీడుగా ఉన్న పొలాలు



కంచిలి: కత్తివరంలో క్యూఆర్ కోడ్ పత్రాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పలాస: లొద్దబద్ర గ్రామంలో పర్యటిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



కోటబొమ్మాళిలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు హేమసుందర్‌రాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, సర్పంచ్ సంజీవరావు



మందస: హరిపురంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్న నాయకులు

హామీలే మిగిలాయి..

ఎన్నికలకు ముందు సూపర్‌సిక్స్ అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఘనంగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా కాలక్షేపం చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శించారు. అధికారం కోసం లేనిపోని హామీలిచ్చి ప్రజలను మోసం చేయడం బాబుకు అలవాటేనని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం మోసాలను ప్రజలకు తెలియజేసేందుకు నిర్వహిస్తున్న 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి నాయకులు ఎన్నికల సమయంలో మేనిఫెస్టో రూపంలో ఇచ్చిన హామీలతో కూడిన క్యూఆర్ కోడ్ పత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. అలాగే గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తు చేశారు.

–సాక్షి నెట్‌వర్క్



కవిటి: రాజపురంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు, కడియాల ప్రకాష్ తదితరులు



సంతబొమ్మాళి: కోటపాడులో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న పార్టీ నాయకుడు కోత సతీష్ తదితరులు



వజ్రపుకొత్తూరు: రెయ్యిపాడులో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మద్దిల హరినారాయణ, సర్పంచ్ బత్సల ధర్మారావు తదితరులు



ఇచ్ఛాపురం రూరల్: అరకబద్రలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న ఎంపీపీ బోర పుష్ప, సిడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తదితరులు



కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 20, 27 వార్డుల్లో కార్యక్రమాన్ని వివరిస్తున్న పట్టణ పార్టీ నాయకులు

ఆత్మీయ సమ్మేళనం



నాలుగు దశాబ్దాల తరువాత వారంతా ఒకే వేదికపై కలుసుకున్నారు. దీనికి కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ వేదికైంది. 1988–89, 1989–90 విద్యా సంవత్సరాల్లో ఇదే పాఠశాలలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. గ్రూపు ఫొటోలను తీసుకొని మురిసిపోయారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను దుశ్శాలువలతో సత్కరించి జ్ఞాపికలను అందజేసి గౌరవించారు. –కవిటి

నవ ధాన్యాల సాగు మేలు..



సేంద్రియ సాగు పద్ధతిలో నవధాన్యాలు సాగుతో సత్ఫలితాలు ఉంటాయని ప్రకృతి వ్యవసాయం గోకర్ణపురం యూనిట్ ఇన్‌చార్జి శీర కామరాజు అన్నారు. కంచిలి మండలం గోకర్ణపురంలో సేంద్రియసాగు పద్ధతిలో నవధాన్యాల సాగు, పంటకోత ప్రయోగంపై ఆదివారం అవగాహన కల్పించారు. ఎటువంటి ఎరువులు వాడకుండా నవధాన్యాలతో అన్ని రకాల పంటలు పండించవచ్చని తెలిపారు. ఇంటర్న్ మెంటర్ సుహాసిని, ఐసీఆర్‌పీ నాగమణి, నారాయణరావు, రేవతి పాల్గొన్నారు. –కంచిలి

వినూత్నంగా స్నేహితుల దినోత్సవం



స్నేహితుల దినోత్సవాన్ని ఇచ్ఛాపురం పట్టణంలో అలయన్స్ క్లబ్ సభ్యులంతా వినూత్నంగా జరుపుకున్నారు. శ్రీసురంగి రాజా క్రీడా మైదానం, శ్రీసురంగి రాజా వారి ప్రభుత్వోన్నత పాఠశాల ఆవరణలో నీడనిచ్చే, ఔషధ మొక్కలను నాటి స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. క్లబ్ అధ్యక్షుడు నరసింహమూర్తి మాట్లాడుతూ.. మానవుడికి మొదటి స్నేహితుడు మొక్కేనని.. వాటిని కాపాడుకోవడం అందరి కర్తవ్యమన్నారు. సభ్యులు బత్తుల వెంకటరమణ, యోగి, గోపీనాథ్, వెంకట్రావ్, లోహిదాస్, బుజ్జి పాల్గొన్నారు. –ఇచ్ఛాపురం

అపూర్వ కలయిక



ఇచ్ఛాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999–2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు అదే పాఠశాల ఆవరణలో ఆదివారం కలుసుకున్నారు. చదువుకున్న రోజులను గుర్తు చేసుకొని మురిసిపోయారు. ఈ సందర్భంగా విద్య నేర్పిన గురువులు మోహనరావు, కేశవరావు, జయలక్ష్మి, జ్ఞానేశ్వరి, విశ్వనాథం, ప్రభాకర్‌ను సత్కరించారు. పూర్వ విద్యార్థులు కృష్ణప్రసాద్, శ్రీను, అశోక్, సంతోష్, శ్యామ్, రవి, బాబూరావు, వాసు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం

నాయకుల పరామర్శ



కిశోర్‌ను పరామర్శిస్తున్న నాయకులు

కాశీబుగ్గ: పలాస మండలం చినంచల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పొట్నూరు కిశోర్ అనారోగ్యంతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న పలాస పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ శ్రీధర్, నాయకులు సిర్ల బుజ్జి తదితరులు ఆదివారం కేజీహెచ్‌కు వెళ్లి కిశోర్‌ను పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాయకులు కూన హేమాచలం, దేవేంద్ర, కంచరాన మధు, బమ్మిడి సురేష్, దవల శ్యాంసుందర్, కొవ్వూరు సంతోష్ ఉన్నారు.

పబ్లిక్ ఫర్ సోషల్ జస్టిస్ సభ్యుల నియామకం

టెక్కలి: పబ్లిక్ ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులను నియమించినట్లు రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కూన వాసుదేవరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా అధ్యక్షునిగా కూన శ్యామలరావు, ఉపాధ్యక్షునిగా కూన డిల్లేశ్వరరావు, ముఖ్య కార్యదర్శులుగా డి.సురేష్, పి.అచ్యుత్‌రావు, ఎ.రమేష్ తదితరులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.